క్లుప్తంగా

నూతన షెడ్ ప్రారంభం



ప్రభుత్వ పాఠశాల నూతన షెడ్ వద్ద విద్యార్థులతో చిరాగ్ ఫౌండేషన్ సభ్యులు

కుక్కునూరు: బండారిగూడెం ఆదివాసీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించిన షెడ్‌ను ఆదివారం గ్రామస్తులతో కలిసి చిరాగ్ ఫౌండేషన్ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు పూరిపాకలో, అపరిశుభ్ర వాతావరణంలో విద్యనభ్యసిస్తుండడాన్ని గమనించి వారికోసం రూ.లక్ష వ్యయంతో నూతన షెడ్‌ను నిర్మించినట్లు తెలిపారు. కాగా షెడ్ నిర్మాణ పనులను ఖమ్మం ఎస్సై పుష్పాల రామారావు పర్యవేక్షించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పి క్రాంతి, పుష్పాల సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముంజులూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి



ముంజులూరు జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు

బుట్టాయగూడెం: మారుమూల గ్రామమైన ముంజులూరు అటవీ ప్రాంతంలో ఉన్న ఏనుగుతోగు జలపాతం వద్ద ఆదివారం పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సందడి చేశారు. కార్తీకమాసం, ఆదివారం కావడంతో ఉభయ గోదావరి జిల్లాలతోపాటు తెలంగాణ, ఇతర ప్రాంతాల నుంచి కూడా అనేక మంది సందర్శకులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి జలపాతం వద్ద స్నానాలు చేస్తూ ఆహ్లాదంగా గడిపారు. జలపాతం జలదారలను కెమెరాలో బందిస్తూ సెల్ఫీలు దిగారు.

వీరేశ్వరునికి లక్షపత్రి పూజ



స్వామికి లక్షపత్రిపూజ నిర్వహించిన దృశ్యం

పోలవరం రూరల్: కార్తీక మాసం సందర్భంగా పట్టిసం శివ క్షేత్రంలో ఆదివారం లక్ష పత్రి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరేశ్వర స్వామికి అభిషేకాలు, లక్ష పత్రి పూజ, భద్రకాళి అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు శివ క్షేత్రాన్ని సందర్శించారు. ఆంధ్ర రీజియన్ జైలు శాఖ డీఐజీ ఎం.రవికిరణ్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. డీఐజీకి దేవదాయ శాఖ అధికారులు స్వాగతం పలుకగా, పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు వేదాశీర్వాదం, స్వామి వారి జ్ఞాపికను అందజేశారు.

చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి



చంద్ర పుల్లారెడ్డికి జోహార్లు అర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: చంద్ర పుల్లారెడ్డి ఆశయ సాధనకు వామపక్ష భావాల పార్టీలు అందరూ ఏకం కావాలని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ రాష్ట్ర కార్యదర్శి డి రంగనాథం పేర్కొన్నారు. చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి సభ కండెల్లి తాతారావు అధ్యక్షతన ఆదివారం మంగపతిదేవిపేట గ్రామంలో నిర్వహించారు. డి.రంగనాథంతో సహా పార్టీ జిల్లా కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ దేశంలో దోపిడీ పీడన లేని సమ సమాజం కోసం కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డితో పాటు అనేకమంది అశువులు బాశారన్నారు. అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి భారత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామిరెడ్డి, కార్యదర్శి మడకం రామన్న, నవ్యాంధ్ర ప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కలింపూడి సుందర్రావు, ఆంధ్రప్రదేశ్ విప్లవ మహిళా సంఘం నాయకురాలు మహమ్మద్ సలీమా, జి.నాగమణి, కట్ట బుజ్జమ్మ పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: కోడిగూడెంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 5 గురుని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2,100, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

నారసింహుని సన్నిధిలో నేడు నారికేళ స్థలి ప్రారంభం

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాధపురంలో సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు కొట్టే స్థలాన్ని, భక్తులు కాళ్లు కడుక్కునే కుళాయిలను సోమవారం ఆలయ ఈఓ ఎన్వీఎస్ఎన్ మూర్తి ప్రారంభిస్తారని ఆలయ అర్చకుడు ఈశ్వర శర్మ తెలిపారు. దాతల సహకారంతో నూతనంగా రూ.1.18 లక్షలు వెచ్చించి ఈ నారికేళ స్థలిని, కుళాయిలను నిర్మించినట్టు ఆయన చెప్పారు.

ఎర్రకాలువను అభివృద్ధి చేయరూ!

- చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టాలంటున్న రైతులు
- ప్రభుత్వం నిధులు కేటాయించాలని వినతి



చింతలపూడి మండలం రేచర్ల వద్ద నీరు లేక వెలవెలబోతున్న ఎర్ర కాలువ

చింతలపూడి: ఈ ఏడాది మెట్ట ప్రాంతంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసినప్పటికీ ఎర్రకాలువ మాత్రం వెలవెలబోతోంది. చింతలపూడి మండలం శెట్టివారిగూడెం వద్ద మేడవరపు చెరువు అలుగు నీరు ప్రవహించేదే ఎర్రకాలువ. ఇక్కడి నుంచి సుమారు 21 కి.మీటర్లు ప్రవహించి ఎర్రకాలువ ప్రాజెక్టులో కలుస్తుంది. సుమారు 350 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న మేడవరపు చెరువు క్రింద సుమారు 2 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తున్న ఈ కాలువ పొడవునా వేలాది ఎకరాలు పండుతోంది. ఒకప్పుడు ఎర్రకాలువ అంటే పొలాలను ముంపునకు గురిచేసే మహమ్మారి అని రైతులంతా భయపడేవారు. 1998లో అప్పటి రాష్ట్ర మంత్రి కోటగిరి విద్యాధరరావు సుమారు రూ.4.11 కోట్ల నిధులు మంజూరు చేయించి కాలువను 17.5 కి.మీటర్లు అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి రైతులకు ముంపు బాధ తప్పింది. రానురాను మెట్ట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎర్రకాలువ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మేడవరపు చెరువును అభివృద్ధి చేసి మినీ ప్రాజెక్టుగా మార్చాలని ఇక్కడి రైతాంగం ఎప్పటి నుంచో కోరుతుంది. వరదల సమయంలో ఎర్రకాలువ నీరు కిందికి ప్రవహించి ఇక్కడి రైతాంగానికి ఉపయోగపడటం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం చెక్ డ్యామ్‌లు కట్టినా భూగర్భ జలాలు పెరిగి మెట్ట ప్రాంతానికి కొంత వరకు ఉపయోగం ఉంటుందని అంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఎర్రకాలువకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షాల వల్ల వచ్చిన వరద నీరు వృథాగా కిందికి పోయింది. వచ్చే వేసవిలో నైనా చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అలాగే మేడవరపు చెరువు ఆక్రమణలు తొలగించి చెరువును అభివృద్ధి చేసినట్లయితే రైతులకు మరింత మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మేడవరపు చెరువును అభివృద్ధి చేయాలి



ప్రభుత్వం మేడవరపు చెరువు పూడికను తొలగించి అభివృద్ధి చేయాలి. ఎర్ర కాలువ నీరు కిందికి పోకుండా ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలు నిర్మించాలి. కాలువ నీరు రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఎర్ర కాలువ అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

– చేపూరి ఖాదర్‌బాబు, రైతు, శెట్టివారిగూడెం

రాజకీయాల్లో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలి



ఆర్యవైశ్య సంఘ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రాజకీయాల్లో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని, అదేవిధంగా సంఘంలోని నిరుపేదలను గుర్తించి వారి పిల్లల చదువు బాధ్యతను తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ తీర్మానం చేసింది. ఆదివారం నల్లూరి మధు పాఠశాల ప్రాంగణంలో 2024–25 నూతన కార్యవర్గ ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడిగా మాటూరి సుధీర్, ప్రధాన కార్యదర్శిగా కంభంపాటి వెంకట సాయి కృష్ణ, కోశాధికారిగా మోటమర్రి ఉమామహేశ్వరరావులతో సహా మరో 20 మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఇప్పటివరకు బాధ్యతలను నిర్వహించిన కమిటీ సభ్యులను సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టి.నరసాపురం: విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందినట్లు హెచ్‌సీ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వల్లంపట్ల గ్రామానికి చెందిన చావల వెంకట దుర్గారావు బస్ డిపోలో ముఠామేస్త్రిగా పనిచేస్తున్నాడు. అప్పుల భారాన్ని తట్టుకోలేక ఈనెల 1వ తేదీన కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం దుర్గారావు మృతి చెందినట్లు హెచ్‌సీ తెలిపారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం, మృతుని భార్య చావల కనకదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పారిశుధ్య కార్మికుడు మృతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కొత్తూరి పిచ్చయ్య (48) ఆదివారం మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పిచ్చయ్య ఆదివారం ఉదయం గుండె నొప్పి రావడంతో మృతిచెందినట్లు కార్మికులు తెలిపారు. పిచ్చయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జేవీ రమణరాజు, జిల్లా అధ్యక్షుడు కూనపాముల విఘ్నేష్ మాట్లాడుతూ పిచ్చియ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఐదుగురి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: కోడిపందేలపై దాడులు నిర్వహించినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని చల్లవారిగూడెం గ్రామ శివారులో కోడిపందేలపై దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1230 నగదు, ఒక కోడి, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా కార్తీక వన సమారాధనలు



జంగారెడ్డిగూడెం: క్షత్రియ వనసమారాధనలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

జంగారెడ్డిగూడెం: కార్తీక మాసం రెండో ఆదివారం సందర్భంగా పలుచోట్ల వనసమారాధన కార్యక్రమాలు జరిగాయి. జంగారెడ్డిగూడెం మండలంలోని వేగవరం సమీపంలో అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ క్షత్రియులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు. అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి కార్యక్రమాలు అభినందనీయన్నారు. తనకు జంగారెడ్డిగూడెంతో మంచి సంబంధాలున్నాయని, తన తల్లిదండ్రులతోపాటు తాను ఇక్కడే నాలుగేళ్ల పాటు ఉన్నట్లు తెలిపారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాపారవేత్త అల్లూరి సీతారామరాజు (ఆగరు సీతారామరాజు) మాట్లాడుతూ పేదలైన క్షత్రియల పిల్లల చదువు, ఆరోగ్యం విషయంలో సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త పెన్మెత్స సుబ్రహ్మణ్యరాజు, మంతెన సోమరాజు, నడింపల్లి నానిరాజు, అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు పెన్మెత్స రంగరాజు, నంబూరి రామ చంద్రరాజు, కోశాధికారి గొట్టుముక్కల భాస్కర రాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో బ్రాహ్మణుల పాత్ర కీలకం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని పర్వతం తులసిరావు తోటలో ఆదివారం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్తు వన సమారాధన కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. బ్రాహ్మణ పరిషత్ గౌరవ అధ్యక్షుడు మల్లాది సీతారామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమైక్య సెక్రెటరీ సుదర్శనం దుర్గబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో బ్రాహ్మణుల పాత్ర కీలకమన్నారు. బ్రాహ్మణులు సమైక్యంగా ఉండి మంచి సమాజ నిర్వహణకు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం రిటైర్డ్ పురాణ పండిట్ వెంపరాల రామకృష్ణ ప్రసాద్ శాస్త్రి కార్తీక మాస విశిష్టతను వన సమారాధన ప్రాముఖ్యతను వివరించారు. అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబా మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని త్వరలోనే నిర్మాణాన్ని సైతం పూర్తి చేయడానికి విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమయమంత్రి రాధాకృష్ణ, కూచి త్రినాధరావు, కొఠారి శ్రీనివాసరావు, ఐలూరి లక్ష్మీ నారాయణ, వెలివెల పెద్దిరాజు, గరిమెళ్ళ గంగాధర శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య అభిలాషుల వనసమారాధన

జంగారెడ్డిగూడెం: స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వెనకాల ఉన్న పామాయిల్ తోట నందు అల్లూరి సీతారామరాజు మునిసిపల్ పార్కు ఆరోగ్య అభిలాషుల కార్తీక వన సమారాధన ఆదివారం జరిగింది. పార్కుకు వచ్చే ప్రతి ఒక్కరూ కూడా కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ క్రీడలు ఆడారు. రాజకుమార్ ఆర్కెస్ట్రా అలరించింది. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

కొయ్యలగూడెం: మండలంలో పలుచోట్ల కార్తీక వన సమారాధనలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో పాటు వివిధ సామాజిక వర్గాల ప్రజలు వన సమారాధనలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని వాటర్ ఫాల్స్‌లకు అదేవిధంగా. హిల్ స్టేషన్లకు తరలివెళ్లి స్థానిక గిరిజనులతో కలసి సామూహిక కార్యక్రమాలు నిర్వహించారు. రేపల్లెవాడ మేధా స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన వన సమారాధనలో నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కొయ్యలగూడెంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న గోశాలకు విరాళాలను సేకరించారు.



జంగారెడ్డిగూడెం: బ్రాహ్మణుల వనసమారాధన నిర్వహించిన దృశ్యం



జంగారెడ్డిగూడెం: అన్నసమారాధనలో పాల్గొన్న ఆరోగ్య అభిలాషులు



కొయ్యలగూడెం: రేపల్లెవాడలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

మొగళ్ళపు వీరన్నకు ఘన నివాళి



మొగళ్లపు వీరన్న వర్ధంతి నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో మొగళ్ళపు వీరన్న 35వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీనివాసపురం రోడ్డులోని మొగళ్ళపు వీరన్న విగ్రహాన్నికి సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏరియా హాస్పిటల్‌లోని మొగళ్ళపు వీరన్న విగ్రహాన్నికి సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, వీరన్న మనుమడు శ్యామ్, వీరేందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ వీరన్న ఒకవైపు నిబద్ధత గల కమ్యూనిస్టుగా ఉంటూ దానధర్మాలు చేయడంలో ముందంజలో ఉండేవారని పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్‌కు 5 ఎకరాలు, సబ్ స్టేషన్ నిర్మాణానికి 2.5 ఎకరాలు, పేదల ఇళ్ల నిర్మాణానికి 5 ఎకరాలు ఇచ్చిన దాత మొగళ్ళపు వీరన్న అని కొనియాడారు. వీరన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మొగళ్ళపు వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు వరకా శ్యామల, అయితా సురేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

వర్గీకరణలో ప్రభుత్వ నిర్ణయాలపై పోరాడతాం

మాలల జేఏసీ ఛైర్మన్ ఉప్పులేటి దేవి ప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న మాలల జేఏసీ ఛైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాద్

జంగారెడ్డిగూడెం: వర్గీకరణ విషయంలో ప్రభుత్వ నిర్ణయాలపై పోరాడతామని అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవి ప్రసాద్ అన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో మాలల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవి ప్రసాద్ మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీన సుప్రీంకోర్టు వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకునే అధికారం ఉందని ఇవ్వడాన్ని దేశంలో ఉన్న అంబేద్కర్ వాదులందరూ నిరసిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల మాలలు అడ్డుకుంటారని, వ్యతిరేకిస్తారని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత తీర్పును దృష్టిలో పెట్టుకొని వర్గీకరణ జోలికి రావద్దని, అసెంబ్లీలో తీర్మానం చేయడానికి ముందుకు వెళ్లొద్దని హితువు పలికారు. ఉమ్మడి రిజర్వేషన్ల పరిరక్షణకై రాష్ట్రంలో డిసెంబర్ 15న హలో మాల చలో అమరావతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మాల యువకులు, విద్యార్థులు నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షులు, ఎస్సీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జేఏసీ గౌరవ సలహాదారులు సంతోష్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్, డాక్టర్ సుబ్బారావు, కొట్నేశ్, పంతగాని వెంకన్న, దుర్గారావు, రాజ్ కుమార్, అధిక సంఖ్యలో మాలలు పాల్గొన్నారు

ఎన్‌డీఏ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి



గవరవరంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న తాజా, మాజీ ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి అనుగుణంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని చేయాలని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కొయ్యలగూడెంకి విచ్చేసిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్లపాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బీజేపీ అధ్యక్షుడిగా చేయటం వలన జిల్లాలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మెట్ట ప్రాంతం అభివృద్ధికి భారీ పరిశ్రమలు రావడమే పరిష్కారం అని అందుకు దోహదపడాల్సిందిగా మాజీ జెడ్పీటీసీ ఎస్ఆర్ఆర్ సుభద్రదేవి మంత్రిని కోరారు. పరింపూడి పంచాయతీలో అభివృద్ధి పనుల నిమిత్తం కోటి ఆరు లక్షల రూపాయలను మంజూరు చేయాల్సిందిగా సర్పంచ్ ముప్పిడి విజయకుమారి మంత్రిని కోరారు. బుట్టాయిగూడెం మండలం రామన్నగూడెం లోని రామాలయానికి చెందిన భూములు కబ్జాకి గురయ్యాయని అక్కడి స్థానికులు వినతిపత్రం సమర్పించారు. కొయ్యలగూడెంలోని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బి.నిర్మలకిషోర్ నివాసంలోనూ అదే విధంగా గవరవరం మాజీ సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహరాజు నివాసంలోనూ ఆయన తాజా, మాజీ ప్రజా ప్రతినిధులచే సన్మానాలు అందుకున్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



కుక్కునూరు: అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కుక్కునూరు: విధి నిర్వహణలో అశువులు బాసిన అటవీ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని కుక్కునూరు అటవీశాఖ రేంజ్ అధికారి కె కృష్ణ కుమారి పేర్కొన్నారు. ఆదివారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం అటవీ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. అటవీ రక్షణకై అశువులు బాసిన అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓలు టి.కేసరి, కె పెరుమాళ్ళు, సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: అటవీ అమరవీరుల దినోత్సవం కన్నాపురం అటవీ శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రేంజర్ వి.దుర్గాకుమార్ బాబు ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల పేర్లతో కూడిన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి పరేడ్ చేసి వందన కార్యక్రమం నిర్వహించారు.

అమరులు చిరస్మరణీయులే

జంగారెడ్డిగూడెం: విధి నిర్వహణలో అమరులైన ప్రతి ఉద్యోగి చిరస్మరణీయులే అని జంగారెడ్డిగూడెం అటవీశాఖ రేంజ్ అధికారి వి.దుర్గాకుమార్‌బాబు అన్నారు. జంగారెడ్డిగూడెం అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో ఆదివారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. స్థానిక రేంజ్ కార్యాలయంలో ఉన్న స్మారక స్థూపం వద్ద అటవీశాఖ అధికారులు నివాళులు అర్పించారు. అనంతరం జంగారెడ్డిగూడెం పట్టణంలో ర్యాలీ, స్థానిక బొసుబొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాకుమార్‌బాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతను చూపిన అమరవీరులను స్ఫూర్తిగా తీసుకొని అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి పి.ధర్మారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం: కన్నాపురంలో అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: అటవీ స్మారక స్థూపం వద్ద అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కన్నాపురం జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించిన దృశ్యం

కొయ్యలగూడెం: కన్నాపురం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో 2002–03 బ్యాచ్ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. మిత్రులంతా కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొంటూ సందడి చేశారు. రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులతో సహా ప్రస్తుత ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. ప్రధానోపాధ్యాయులు గంగాధర్ రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, సత్యనారాయణ, రాజు, భీమరాజు, సుధాకర్, శ్యాంబాబు, టి.శ్రీను, జి.శ్రీను, నాగు, లక్ష్మీనారాయణ, ప్రభావతిలను గౌరవించి జ్ఞాపికలతో సత్కరించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆశీస్సులు అందజేసి జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా తమ పిల్లలతో నాటి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరింప చేశారు.